క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులకు బీమా పరిహారం అందజేస్తున్న సురేష్‌యాదవ్

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డుకు చెందిన జోడపాటి తిలక్ విజయ్‌కుమార్ కిడ్నీ సమస్యతో ఇటీవల మృతి చెందారు. దీంతో అతని కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ. 10 వేలు పార్టీ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ శుక్రవారం అందించారు. హిమాచల్‌నగర్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సురేష్‌యాదవ్ మాట్లాడుతూ విజయ్‌కుమార్ కిడ్నీ సమస్యతో చనిపోవటం బాధాకరమన్నారు. మృతుడు బీమా సభ్యుడు కావటంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరదేశమ్మ పండగ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గ్రామకమిటీ సభ్యులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి కాలనీలో వెలసిన పరదేశమ్మ వారి పండగ మహోత్సవాల కరపత్రాలను గ్రామకమిటీ సభ్యులు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. పండగ వివరాలను తెలియజేశారు. 8న తొలిరోజు ఉజిడి బండి తోలుట, 10వ తేదీన రాత్రి 7 గంటలకు అమ్మవారి పుట్టుక తెచ్చుట, 11వ తేదీన మంగళవారం సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమం, అదే విధంగా 17వ తేదీన సోమవారం రాత్రి 8 గంటలకు అమ్మవారి తొలేళ్ల పండగ ఘనంగా నిర్వహించనున్నామన్నారు. 18వ తేదీ ఆఖరి రోజున అమ్మవారి పండగ మహోత్సవం సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భారీ బాణసంచా నడుమ అమ్మవారి పండగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కణితి గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలకు వినతి



అమృతరావు విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను పనిలోకి తీసుకోవడంతో పాటు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించేలా చూడాలని ఉక్కు శ్రామిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఉక్కు హిల్‌టాప్ కూడలి వద్ద స్మృత్యంజలి పార్కులోని ఉక్కు ఉద్యమ నేత అమృతరావు విగ్రహానికి నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు లేకపోవడంతో పాటు గత నెలాఖరు నుంచి విధులకు ఆపివేయడంతో కాంట్రాక్టు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారిని వెంటనే పనుల్లోకి తీసుకుని, కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో రమేష్ నాయుడు తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

జగనన్నే మా భవిష్యత్తు

- ముక్తకంఠంతో చెబుతున్న ప్రజలు
- ప్రభుత్వం అందిస్తున్న లబ్ధి.. పథకాల గురించి వివరించిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఒక ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్ కుమార్



58వ వార్డులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ లావణ్య



పిలకవానిపాలెంలో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న చుక్క వరలక్ష్మి

మల్కాపురం : 'జగనన్నే మా భవిష్యతు –మా నమ్మకం నీవే జగన్' కార్యక్రమం పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో శుక్రవారం జరిగింది. 58వ వార్డు పరిధి గుల్లలపాలెం వద్ద జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య పాల్గొని పలు ఇళ్లకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రతినెల ఒకటో తేదీన వలంటర్ వచ్చి పింఛన్ అందిస్తున్నారని, అలాగే రేషన్, సచివాలయాల సేవలు ఇంటి వద్దే అందుతున్నాయని తెలిపారు. దీనికి స్పందించిన వైఎస్సార్‌సీపీ నేతలు గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితి ఉండేదా అని ప్రశ్నించగా.. ప్రజలు లేదని సమాధానం చెప్పారు. లబ్ధిదారుల చెంతకే సేవలు అందిస్తున్న ప్రభుత్వం కావాలా.. జన్మభూమి కమిటీలంటూ కాలయాపన చేసే వారు కావాలో ఆలోచన చేసుకోవాలని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు కృష్ణ, మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు, కన్వీనర్లు రాంబాబు, కన్నబాబు, సంతోష్, కనకమహాలక్ష్మి, దుర్గమ్మ, వరలక్ష్మి, కృష్ణ, ఎదురరాజు, గురునాథ్‌రెడ్డి, పిలక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇదే వార్డులో పిలకవానిపాలెం వద్ద జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి పాల్గొని ప్రచారం చేశారు. కార్యక్రమంలో గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు. 61వ వార్డు పరిధి మల్కాపురం పల్లివీధి, గొల్లవీధి తదితర ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని ప్రజలకు నవరత్నాల ద్వారా అందుతున్న సేవలపై వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాడి సత్యనారాయణ, కొల్లి నూకరెడ్డి, బూస అప్పలరెడ్డి, చట్టి నూకరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

92వ వార్డులో..

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆడారి ఆనంద్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, మిలీనియం శ్రీధర్ ప్రారంభించారు. ఇక్కడి లక్ష్మీనగర్‌లో పలు ఇళ్లకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. నిన్ను నమ్మం బాబూ అంటూ చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చని వైనాన్ని వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏ విధంగా నెరవేర్చారన్న విషయాన్ని విశదీకరించారు. తన కోసం.. తన పిల్లల భవిష్యత్తు కోసం జగనన్నను నమ్ముతాననే ప్రశ్నావళిని కుటుంబ పెద్దల చేత నింపిచారు. పలువురు మహిళలు జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పాలనను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. తాము మళ్లీ జగనన్నకే ఓటు వేస్తామని చెబుతుండడం విశేషం. ఈ కార్యక్రమంలో పలు వార్డుల అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, చుక్క ప్రసాదరెడ్డి, దొడ్డి కిరణ్, కార్పొరేటర్లు ముర్రు వాణి, పీవీ సురేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, గేదెల మురళీకృష్ణ, పూటపల్లి గోవిందు, అయితంశెట్టి గోపి, యల్లపు వెంకటేశ్వరరావు, కంపర కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

89, 90 వార్డుల్లో..

జీవీఎంసీ 89, 90 వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 89వ వారులో ఆ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ ఆధ్వర్యంలో కొత్తపాలెంలో ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని వివరించారు. ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, నగర కార్యదర్శి ఆళ్ల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

-90వ వార్డు రెడ్డి వీధిలో వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. టీడీపీ పాలనకు.. జగనన్న పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. ప్రధాన కార్యదర్శి యల్లపు వెంకటేశ్వరరావు, బోర అప్పలరెడ్డి, సంబాల లక్ష్మి, ఎస్పీ రెడ్డి, కమలమ్మ, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరాజుపాలెం రెడ్డి వీధిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కొత్తపాలెంలో ఒక ఇంటి వద్ద ప్రచారం చేస్తున్న నాయకులు

విద్య, వైద్యానికి పెద్దపీట



జగనన్నే మా భవిష్యత్తు కరపత్రాన్ని ప్రదర్శిస్తున్న ఆనంద్‌కుమార్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి
- జగనన్నే మా భవిష్యత్తు పోస్టర్ ఆవిష్కరణ

గోపాలపట్నం: మోసగాళ్ల ప్రభుత్వానికి.. జగనన్న సంక్షేమ పాలనకు ఉన్న తేడాను ప్రజలకు చూపిస్తున్నామని విశాఖ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మ్యానిఫెస్టోను పవిత్రంగా భావించి 98 శాతం హామీలు అమలు చేసి దేశ చరిత్రలో రికార్డు సృష్టించారన్నారు. ప్రధానంగా నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మంచి జరిగేలా చేశారని తెలిపారు.

నాడు- నేడుతో నూతన శకం

నాడు – నేడు ద్వారా విద్యావ్యవస్థలో నూతన శకానికి నాంది పలికారన్నారు. గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన ప్రభుత్వ విద్యతో పాటు ఆరోగ్యశ్రీని బలోపేతం చేసి పేదలకు పెద్ద దిక్కుగా సీఎం జగన్ నిలిచారన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో ప్రజల్లోకి వెళుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏవిధమైన అభివృద్ధి జరిగింది... జగనన్న ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి ఏవిధగా ఉందన్న విషయాన్ని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయని విధానం, జగనన్న ప్రభుత్వం చేపట్టిన పథకాలు గురించి ప్రజలకు గణాంకాలతో సహా అందజేస్తామన్నారు. సమావేశంలో కన్వీనర్ హర్షవర్ధన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మిలీనియమ్ శ్రీధరరెడ్డి, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు ముర్రు వాణి, పీవీ సురేష్, వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, చుక్క ప్రసాదరెడ్డి, దొడ్డి కిరణ్ , పిలకా రామ్మోహనరావు, నాయకులు గేదెల మురళీకృష్ణ, బాకి శ్యామ్ కుమార్ రెడ్డి, ఆళ్ల పైడిరాజు, పూటపల్లి గోవిందు,అయితశెట్టి గోపి, యల్లపు వెంకటేశ్వరరావు, నమ్మి శ్రీను, కంపర కొటేశ్వరరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్చిల్లో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



శిలువ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



ఇందిరానగర్ చర్చిలో శిలువ వేసే దృశ్యం...



ఎరుసలేమ్ చర్చిలో ప్రవచిస్తున్న సిస్టర్ ఏంజిల్ బ్లెస్సీ



రివైవల్ చర్చి ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



యారాడలో ర్యాలీ చేస్తున్న లైట్ హౌస్ చర్చి సభ్యులు

మల్కాపురం: క్రీస్తు శిలువ మరణాన్ని గుర్తు చేస్తూ మల్కాపురం నుంచి కోరమాండల్ వరకు శుక్రవారం శిలువతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక సెయింట్ జోసెఫ్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో సుమారు 600 మంది క్రీస్తు సోదరులు పాల్గొని క్రీస్తు గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు. అలాగే పలు చర్చిలలో ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు శిలువ ద్వారరా ఎలా మరణం పొందారో ఇక్కడ ఫాస్టర్లు వివరించారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

గోపాలపట్నం: గుడ్‌ఫ్రైడేను గోపాలపట్నం. ఎస్‌ఏడీ ప్రాంతంలోని పలు చర్చిల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రార్థనలు చేశారు. బుచ్చిరాజుపాలెం జయప్రకాష్‌నగర్, సెయింట్ థామస్ చరిచ, ఎస్‌ఏడీ యునైటెడ్ క్రైస్ట్ చర్చి, లక్ష్మీనగర్ సేవియర్ లూథరన్ చర్చి, ఇందిరానగర్ లైఫ్ ఛేంజింగ్ రివైవల్ సెంటర్ చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు మరణించిన దినాన్ని గుడ్‌ఫ్రైడేగా పిలుస్తారని తెలిపారు. వేలాది మంది భక్తులు పాల్గొని క్రీస్తు చేసిన త్యాగాన్ని భక్తి శ్రద్ధలతో కొనియాడారు. ఎరుసలేమ్ చర్చి దైవ జనురాలు సిస్టర్ పీస్ ఏంజెల్ బ్లెస్సీ ప్రభువు శిలువులో వ్యక్తపరిచిన ఏడు మాటలను భోదించారు. ఉపవాసంతో ఉన్న భక్తులకు మజ్జిగ అందించారు. లైఫ్ ఛేంజింగ్ రివైల్ చర్చిలో శిలువ నమూనాతో చేసిన ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది.

లైట్ హౌస్ చర్చిలో...

సింధియా: యారాడ గ్రామంలోని లైట్ హౌస్ చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రాథనలు చేశారు. ముందుగా క్రీస్తు శిలువ మార్గాన్ని అనుసరిస్తూ యారాడ పురవీధుల్లో శిలువ ధారణను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు.శిలువ మోస్తూ క్రీస్తు ప్రజలను పాప విముక్తులను చేశారని పాస్టర్ సురేష్‌కుమార్ ,రెవరెండ్ సిస్టర్ శాంతికుమారి వివరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు గంట్యాడ గోవింద్, గంట్యాడ రమణ, కాసులమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

గేటుకు అడ్డంగా వాహనాల పార్కింగ్

ఇబ్బంది పడుతున్న వాకర్స్



గేటుకు అడ్డంగా నిలిపిన ద్విచక్ర వాహనాలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కు గేటు ఎదురుగా ద్విచక్ర వాహనాలు నిలపడంతో సందర్శకులు లోపలికి వెళ్లలేని పరిస్థితి కలుగుతోంది. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు వాకర్స్ ఉదయం,సాయంత్రం సమయాల్లో వాకింగ్‌కు వస్తారు. అయితే ఇక్కడ కాలక్షేపం చేయడానికి వచ్చే కొంత మంది యువకులు తమ వాహనాలను ఇక్కడ గేటుకు అడ్డంగా పెడుతున్నారు.దీంతో వాకింగ్‌కు వచ్చే వృద్ధులు వాహనాలను తప్పించుకునే లోపలకి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు దృష్టి పెట్టి గేటుకు ఎదురుగా వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు.

మంచి అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం



గాజువాక పీహెచ్‌సీలో ప్లకార్డుల ప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న పెదగంట్యాడ పీహెచ్‌సీ సిబ్బంది

గాజువాక : గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలపై ప్లకార్డులను ప్రదర్శించారు. మంచి ఆహారపు అలవాట్లతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని వక్తలు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.నాగ అప్పారావు, ఎంపీహెచ్‌ఈవో ఎస్ఎస్‌వీఎన్ రాజు, ఆరోగ్య సిబ్బంది వై.లక్ష్మి, ఎం.ఈశ్వరరావు, కిశోర్, వై.నాగ లక్ష్మి, రెహ్మత్, జగదీశ్వరి, సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పెదగంట్యాడ: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎంవీఎస్ అన్నపూర్ణ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరు నెలలకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పోషకాహారం, సమతుల ఆహారం తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి తనకాల సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, యూపీహెచ్‌సీ సిద్ధేశ్వరం సిబ్బంది పాల్గొన్నారు.

అజంతా పార్క్ వద్ద మృతదేహం గుర్తింపు

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి అజంతా పార్క్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఎయిర్ పోర్టు పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్‌కు చెందిన చుర్కా తుడు కుటుంబ సభ్యులతో మాల్దా స్టేషన్‌లో ఈ నెల 3న దిబ్రుగూడ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. మృతుడికి మతిస్థిమితం లేదు. మద్యం సేవించి ఉండడంతో 4వ తేదీ రాత్రి 8.30 సమయంలో అజంతాపార్క్ వద్దకు వచ్చేసరికి దూకేందుకు యత్నించారు. డోర్ దగ్గరున్న వారు వారించినా ఆగకుండా దూకేశాడు. అతను ఎక్కడ దూకాడో, ఏం జరిగిందో అర్థం కాక మృతుడి భార్య సికింద్రాబాద్ వెళ్లిపోయింది. మృతుని వద్ద ఉన్న ఫోన్ నంబర్ల ద్వారా సంబంధీకులకు సమాచారమివ్వడంతో శుక్రవారం మృతుని భార్య సోలాని మర్డి రావడంతో అసలు విషయాలు వెలుగుచూశాయి. వీరు సికింద్రాబాద్‌లో రోజుకూలీలుగా పని చేస్తుంటారు. కూలి పనుల కోసం వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతదేహాన్ని మృతుని బంధువులకు అప్పగించారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పిస్తారు.

రోగుల సహాయకుల కోసం షెడ్ల నిర్మాణం



వెయిటింగ్ హాలును ప్రారంభించిన డాక్టర్ అశోక్ కుమార్ తదితరులు

- కేజీహెచ్ గైనిక్ వార్డు వద్ద ఏర్పాటు

మహారాణిపేట: ఉత్తరాంధ్రలో రోగులకు పెద్ద దిక్కుగా ఉన్న కింగ్ జార్జి ఆస్పత్రి ప్రసూతి రోగుల సహాయకుల కోసం వెయిటింగ్ షెడ్లు నిర్మించారు. రూ. 12 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఈ నిర్మాణం జరిగింది. గతంలో రోగులు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే వారి సహాయకులు వార్డు బయట ఎండకు ఎండి, వానకు తడిసి వార్డు పడిగాపులు కాసేవారు. ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రోగుల సహాయకుల బాధలు చూసి చలించిపోయారు. సీఎస్ఆర్ నిధులతో వెయిటింగ్ హాలు నిర్మించాలని ఆదేశించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీఏ నాయుడు ఆధ్వర్యంలో డీఈఈ మన్మథరావు షెడ్లు నిర్మించారు. సామగ్రి భద్రపరచుకోవడానికి కప్‌బోర్డులు, సెల్‌ఫోన్ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క షెడ్డులో 20 నుంచి 30 మంది వరకు ఉండడానికి వీలుగా నిర్మాణం జరిగింది. అన్ని సదుపాయాలతో నిర్మించిన వెయిటింగ్ హాలును శుక్రవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకృష్ణ, డాక్టర్ ఎ.పద్మజ, ఏఆర్ఎంవో డాక్టర్ కె.జగదీష్‌కుమార్, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెయిటింగ్ హాలు కోసం నిధులు మంజూరు చేసిన కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఆస్పత్రి అభివృద్ధికి కలెక్టర్ ఎంతో సహకారం అందిస్తున్నారని డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు.

అలరించిన కర్ణాటక సంగీత కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయని రిషిత లక్ష్మి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం కర్ణాటక సంగీత కచేరీ జరిగింది. గన్నవరపు రిషిత లక్ష్మి అద్భుత గానంతో త్యాగరాజ, రామదాసు, ముత్తుస్వామి దీక్షితులు కీర్తనలు ఆలపించి ఆహుతులను అలరించారు. వాతాపి గణపతిం, సీతమ్మ, మరుగేలరా, ఎవరూర, ఉపచారము, మా జానకి, తెలిసిరామ, పలుకే బంగార, చరణములే, శ్రీరామ నీనామం, ఎంత పనిచేసితివి కీర్తనలు భక్తులను సంగీత సాగరంలో ఓలలాడించాయి.

ఈమెకు ఎస్.కృష్ణప్రియ వయోలిన్‌పై, బి.గిరిధర్‌రెడ్డి మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని రిషితను అభినందించి సత్కరించారు.

14 నుంచి సీపీఐ, సీపీఎం ఇంటింటి ప్రచారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ, సీపీఎం కార్యదర్శులు పైడిరాజు, జగ్గునాయుడు

అల్లిపురం: ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై, సమస్యల పరిష్కారంలో చూపుతున్న నిర్లక్ష్యంపై ప్రజలకు వివరించేందుకు సీపీఐ, సీపీఎం పార్టీలు ఈ నెల 14 నుంచి జిల్లాలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తాయని ఆ పార్టీల కార్యదర్శులు ఎం.పైడిరాజు, ఎం.జగ్గునాయుడు తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద విధానాలను అనుసరిస్తూ పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, సీఎస్ క్షేత్రపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎం.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుధాకర్‌కు సన్మానం



ఏఎంసీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌ను సన్మానిస్తున్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు

మహారాణిపేట : కోవిడ్ సమయంలో అందించిన వైద్య సేవలకు గుర్తింపుగా శుక్రవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్‌ను రాజయోగ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ఫౌండేషన్ మెడికల్ వింగ్ (ఆర్ఈఆర్ఎఫ్), బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు సన్మానించారు. విపత్కాలంలో ధైర్యంగా వైద్యసేవలు అందించినందుకుగాను డాక్టర్ సుధాకర్ సేవలను కొనియాడుతూ ప్రశంసాపత్రంపై బ్రహ్మకుమారీస్ సెంటర్ ఇన్‌చార్జి బి.కె.శివలీల, ఆర్ఈఆర్ఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ అశోక్‌మెహత, కార్యదర్శి డాక్టర్ బి.కె.షా తదితరులు సంతకాలు చేశారు.